సాక్షి
అనకాపల్లి
సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

నూకాంబిక ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈపీడీసీఎల్ ఎండీ పృథ్వితేజ్, జేసీ జాహ్నవి దంపతులు అమ్మవారిని దర్శించారు. 8లో

ఉష్ణోగ్రతలు

ఆదివారం

	గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి :	35.0/26.5
చోడవరం :	37.0/28.0



పాలిటెక్నిక్ పిడుగులు

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు సత్తా చూపారు. క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికై కొలువులు సాధించారు. 8లో

న్యూస్‌రీల్

చందనం చెక్కలు సిద్ధం



చందనం చెక్కలను ముక్కలుగా కోస్తున్న ఉద్యోగి సాంబ

సింహాచలం: ఈనెల 24 నుంచి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో తొలి విడత చందనం అరగదీత కార్యక్రమం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు ఆదివారం అరగదీతకు అణువుగా చందనం చెక్కలను ముక్కలుగా కోశారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్ సమక్షంలో చందనం చెక్కలను తూకం వేశారు. ఈనెల 30న వైశాఖ శుద్ధ తదియని పురస్కరించుకుని ఆ రోజు స్వామికి తొలివిడతగా 125 కిలోల పచ్చి చందనాన్ని సమర్పిస్తారు.

నేడు జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

జూన్ 4న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అభిమానులు

యలమంచిలి రూరల్: గాన గంధర్వుడు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని వచ్చే జూన్ 4వ తేదీన యలమంచిలిలో రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు బాలు అభిమాన సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం యలమంచిలి పాతవీధిలో మత్తుర్తి రామారావు నివాసంలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పాటల పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బాలు అభిమానులు, సీనియర్ సిటిజన్ల సమక్షంలో ఆవిష్కరించారు. యలమంచిలి గుర్రప్ప కల్యాణమండపంలో జూన్ 4వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పాటల పోటీలను అందరూ జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఇప్పట్నుంచే రెండు తెలుగు రాష్ట్రాల్లో పాటల పోటీలకు సంబంధించిన సమాచారాన్ని పంపిస్తున్నామని, అధిక సంఖ్యలో గాయకులు పాల్గొనేలా చేయడమే తమ లక్ష్యమని నిర్వాహకులు చెప్పారు. అదే రోజు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత విభావరి కూడా ఉంటుందన్నారు.పాటల పోటీల్లో పాల్గొనదలచిన వారు 9866307171, 8184803083 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇవటూరి సాంబశివరావు, ఆడారి అప్పారావు,ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమానులు పాల్గొన్నారు.

కోణార్క్‌లో డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు



కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ప్యాంట్రీకార్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డీఆర్ఎం

తాటిచెట్లపాలెం (విశాఖ): భువనేశ్వర్ నుంచి ముంబయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోరా ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆన్ బోర్డ్ హౌస్ కీపింగ్ సర్వీసెస్ ద్వారా రైల్లో ప్రయాణించే ప్రయాణికులకు అందజేసే లినెన్(బెడ్‌రోల్స్) నాణ్యతను పరిశీలించారు. ప్యాంట్రీకార్‌లో పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రైళ్లలో అందుతున్న వివిధ భద్రతా ప్రమాణాలను, సదుపాయాల గురించి ప్రయాణికుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అదేవిధంగా రైళ్లలో ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనుమానిత వస్తువులు, మనుషుల గురించి సమాచారం తెలిస్తే సంబంధిత అధికారులకు లేదా 139 నెంబరుకు తెలియజేయాలని సూచించారు.

సడి లేని... నీటిపారుదల

నిర్లక్ష్యం నీడన జలాశయాలు



- కదలని పూడికతీత, కాలువ మరమ్మతుల పనులు
- అధ్వానంగా సాగునీటి కాలువలు
- దెబ్బతిన్న గేట్లు..ధ్వంసమైన వాటర్ ఫ్లో రోప్‌లు
- లీకులతో వేలాది క్యూసెక్కుల నీరు వృథా
- పూడికతీతలపై చంద్రబాబు సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం
- మరమ్మతులకు నిధులు కేటాయించని వైనం



కళ్యాణపు లోవ రిజర్వాయర్‌లో వాటర్ ఫ్లో వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారం, తుప్పలు

జిల్లాలో ఒక మేజర్ నీటిపారుదల ప్రాజెక్టు, మూడు మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టులు, 2880 చిన్న నీటి పారుదల ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 3,05,993 ఎకరాల ఆయకట్టు భూమి రైతులున్నారు. వీరంతా ఆనందంగా ఉండాలంటే రిజర్వాయర్‌ల్లో నిండుగా నీరుండాలి..అది ఆయకట్టు రైతులకు పూర్తిగా అందాలి. సకాలంలో రిజర్వాయర్లల్లో మరమ్మతులు, సాగునీటి కాలువల్లో పూడికతీత, దెబ్బతిన్న గేట్లు రిపేర్లు, ధ్వంసమైన వాటర్ ఫ్లో రోప్‌ల మరమ్మతులు వంటివి చేపట్టాలి. ఈ పనులు సకాలంలో సక్రమంగా చేయకపోయినా సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో శివారు ఆయకట్టు రైతులకు నీరు అందే పరిస్థితి ఉండదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నేటికి 11 నెలలు కావస్తున్నా..జలాశయాల ఆధునికీకరణ, మరమ్మతులపై దృష్టి సారించలేదు.

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో ఉన్న రిజర్వాయర్ల ఆధునికీకరణ, మరమ్మతులతో పాటు సాగునీటి కాలువల్లో పూడికతీత పనుల్లో కదలిక లేదు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రిజర్వాయర్ల పరిధిలో ఆయుకట్టు రైతులకు శివారు భూములకు కూడా సాగు నీరు అందాలంటే.. వేసవిలోనే రిజర్వాయర్ గేట్ల మరమ్మతులు, దెబ్బతిన్న చెక్‌డ్యామ్‌లను మరమ్మతు చేయడం , సాగునీటి కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. మరో నెలన్నర రోజుల్లో వర్షా కాలం రానుంది. ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభం కానుంది. కానీ ఇప్పటికీ జిల్లాలో ఉన్న ఐదు మేజర్ రిజర్వాయర్లు ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో గేట్లు, చెక్‌డ్యామ్‌లు దెబ్బతిని నిత్యం వందలాది క్యూసెక్కుల నీరు వృథాగా బయటకు పోతున్న పరిస్థితి నెలకొంది. సాగునీటి కాలువలు కూడా పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీరు విడుదల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శివారు భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదు.



దేవరాపల్లి మండలం పెదనందిపల్లి బీసీ కాలనీ సమీపంలో రైవాడ రిజర్వాయర్ నుంచి వచ్చే సాగు నీటి కాలువలో శిథిలమైన తూము



గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతులకు నిధులను మంజూరు చేసింది. కొన్నింటికి పనులు కూడా ప్రారంభమయ్యాయి. మరికొన్నింటికి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వాటిలో కొన్నింటిని రద్దు చేయడమే కాకుండా..మరికొన్నింటిలో టెండర్‌లను కూడా మార్చివేస్తుంది. అధికారం చేపట్టి నేటికి 11 నెలలు పూర్తి కావస్తున్నా..చంద్రబాబు సర్కార్ మొద్దు నిద్ర వీడలేదు. ఇప్పటికీ జలాశయాల పరిధిలో కాలువల పూడికతీత పనులకు, మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను కొనసాగించకుండా ఈ ప్రభుత్వం రిజర్వాయర్ల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. గత ఏడాది వర్షాకాలంతో పాటు, నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన వర్షాలకు ఈ జలశయాల్లో నీరు ఎక్కువగా చేరింది. అయితే, లీకులతో ఈ నీరు చాలా వరకూ వృథాగా పోయింది. గత ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ఇస్తానన్న రైతుకు పెట్టుబడి సాయం అందించపోవడం, భారీ వర్షాల కారాణంగా పంట నష్టపోవడంతో జిల్లాలో రైతు కుదేలయ్యాడు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంటే రైతన్న పరిస్థితి మరింత అగమ్యగోచరం అవుతుంది.రానున్న ఖరీఫ్ సీజన్ దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఈ జలాశయాలపై దృష్టి పెట్టాలని రైతులు వేడుకుంటున్నారు. కానీ ప్రభుత్వం చెవికెక్కడం లేదు.

జిల్లాలో 3,05,993 ఎకరాల ఆయకట్టు భూమి

అనకాపల్లి జిల్లాలో ఒక భారీ నీటిపారుదల ప్రాజెక్టు(తాండవ), మూడు మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులు(రైవాడ, పెద్దేరు, కోనాం), 2880 చిన్న నీటి పారుదల ప్రాజెక్టులు (చెరువులు, గ్రోయిన్లు, చెక్ డ్యాములు) ఉన్నాయి. వీటి పరిధిలో 3,05,993 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. వీటిలో తాండవ పరిధిలో 32,689 ఎకరాలు, మూడు మధ్య తరహా నీటి ప్రాజెక్టులు రైవాడ, పెద్దేరు, కోనాం పరిధిలో 42,725 ఎకరాలు, 2880 చిన్న తరహా నీటి పారుదల ప్రాజెక్టుల కింద 2,30,579 ఎకరాల ఆయకట్టు ఉంది.



నాతవరం మండలం ఎంబీపట్నం సమీపంలో మరమ్మతులకు గురైన సాగునీటి కాలువ

తక్కువ పనులను ప్రభుత్వానికి పంపాం

జిల్లాలో ఉన్న మేజర్, మైనర్ సాగునీటి ప్రాజెక్టు పరిధిలో హై ప్రయారిటీ కింద సుమారుగా రూ.8 కోట్లతో 83 పనులు మంజూరయ్యాయి. వాటితో పాటు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అక్కడక్కడ పూడికతీత పనులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో 25 శాతం కన్నా తక్కువగా జరిగిన పనుల విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అవి మరో 10 రోజుల్లో ప్రభుత్వం నుంచి వచ్చే నిర్ణయం ప్రకారం కొనసాగించాలా.. లేదా రద్దు చేయాలనే నిర్ణయం తీసుకుంటాం.

– త్రినాథ్, ఇరిగేషన్ ఈఈ, అనకాపల్లి జిల్లా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరై ప్రస్తుతం నిలిచిపోయినవి..

- పెద్దేరు రిజర్వాయర్‌లో మరమ్మతులు, ఆధునికీకరణ పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.9.12 కోట్లు మంజూరు చేశారు. ఆ పనులను శ్రీసాయి లక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్‌కు కూడా అప్పగించారు. ఆ పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసేందుకు ప్రతిపాదనలు చేసింది. అంతేకాకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కాలువల మరమ్మతులు, పూడికతీత, ఆధునికీకరణలకు రూ. 84.40 కోట్లు మంజూరు చేసింది. అవి పనులు కూడా ప్రారంభమయ్యాయి. వాటిని కూడా రద్దు చేసేందుకు ఈ ప్రభుత్వం కుట్రలు పన్నుతుంది
- దేవరాపల్లి మండలంలో ఉన్న రైవాడ జలాశయం ప్రాజెక్టు డ్యామ్ పునరుద్ధరణకు, మరమ్మతులకు రూ.336 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. కానీ ఇప్పటివరకూ ఎటువంటి పురోగతి లేదు. జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ ఆర్థిక సహాయకంతో దేవరాపల్లి మండలంలో రైవాడ జలాశయం ఆధునికీకరణ పనులకు రూ.30.43 కోట్లు మంజూరు చేసింది. వీటిలో రూ.4 కోట్ల కొంత మేర పనులు కూడా చేశారు. ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.
- అదేవిధంగా మైనర్ ప్రాజెక్టులైన మాడుగుల మండలం తాటిపర్తి గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ జలాశయానికి 2022లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.21.75 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం మారడంతో అవి మూలన పోయాయి. వాటికి ఇప్పుడు పనులకు రూ.5.15 కోట్లు ప్రతిపాదనలు సమర్పించారు.
- మాడుగుల మండలం శంకరం గ్రామం వద్ద ఉరకగెడ్డ జలాశయం బ్యాలెన్స్ పనులను గత ప్రభుత్వంలో 2023లో రూ.14.50 కోట్లకు ప్రతిపాదించారు. వాటిని కూటమి ప్రభుత్వ ఆమోదించలేదు.



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, ఉన్నతి కార్యక్రమం

- మూడు రోజుల పాటు విద్యా ప్రవేశం నమోదు డ్రైవ్
- 1 నుంచి 10 వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులంతా శత శాతం అక్కడే చేరాలి
- ప్రధానోపాధ్యాయులకు డీఈవో అప్పారావునాయుడు ఆదేశం



సాక్షి, అనకాపల్లి: రానున్న విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, అనుబంధ యాజమాన్యాల పాఠశాలల్లో చదివిన విద్యార్థుల నమోదు, తరగతుల ఉన్నతి(ప్రమోషన్) డ్రైవ్‌ను చేపడుతున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిధిలో విద్యా ప్రవేశం నమోదు డ్రైవ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఆదివారం ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బృందాలుగా ఆయా పాఠశాలల ప్రాంతాల్లో వెళ్లి ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఒకటో తరగతిలోకి, ఐదో తరగతి కోర్సు పూర్తయిన వారిని సమీప ప్రభుత్వ, అనుబంధ యజమాన్యాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరేలా, అలాగే ఉన్నత పాఠశాలలో ఎనిమిది ఉత్తీర్ణులైన వారిని తొమ్మిదో తరగతిలోకి, 10 వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారిని ఇంటర్మీడియట్, ప్లస్ వన్ తరగతులలో చేర్పించేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న యూనిఫాం, బూట్లు, బ్యాగులు, బెల్టులు, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం తదితర సౌకర్యాలని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. రాష్ట్రంలో రానున్న 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న నూతన విద్యా విధానం, మోడల్ పాఠశాలలు, విద్యార్థులు ఉపాధ్యాయుల నిష్పత్తి, శత శాతం ఉపాధ్యాయుల భర్తీ, ఆంగ్ల బోధన, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర వివరాలన్నీ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. జిల్లాలో శత శాతం నమోదు, ఉన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన సూచించారు.

ఐటీ కంపెనీకి భూముల కేటాయింపులో అవినీతి?

- మంత్రి లోకేష్‌పై జనజాగరణ సమితి ధ్వజం
- చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన



చెవిలో పూలు పెట్టుకొని ప్రదర్శన చేస్తున్న సునీల్ కుమార్ తదితరులు

ఎంవీపీకాలనీ (విశాఖ): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబూ.. ఉత్తరాంధ్రుల చెవిలో పూలు పెట్టొద్దంటూ జనజాగరణ సమితి ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టింది ఇటీవలే పుట్టుకొచ్చిన ఉర్సా క్లస్టర్స్ ఐటీ కంపెనీకి విశాఖలో 60 ఎకరాల భూమిని కారుచౌకగా కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ.. సమితి నాయకులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఎంవీపీ కాలనీలో ఆదివారం ఉదయం ఈ కార్యక్రమంలో సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్ మాట్లాడారు. నిరుద్యోగులకు ఐటీ ఉద్యోగాలు అని చెప్పి.. కేవలం 2 నెలల క్రితం ఆవిర్భవించిన కంపెనీకి విశాఖలో రూ.3 వేల కోట్లు విలువైన భూములను ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కావాలనే లోకేష్ ఈ నకిలీ కంపెనీకి విలువైన భూములు కేటాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, వెంటనే ఈ కేటాయింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పోరాటానికి ఉత్తరాంధ్ర విద్యార్థి, యువజన సంఘాలు నడుంకట్టాలని పిలుపునిచ్చారు. సమితి నాయకులు వాసు, దేవర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి



నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో జలకాలు ఆడేందుకు సందర్శకులు పోటీ పడ్డారు. ఎండ తీవ్రత కారణంగా వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో జలపాతం నుంచి నీటి ప్రవాహం గణనీయంగా తగ్గింది. నీరు తక్కువగా రావడంతో పెద్దలతో పా టు చిన్నారులు సైతం జలకాలు అడేందుకు ఉత్సా హం చూపారు. వేసవి సెలవులు కావడంతో దూర ప్రాంతాల నుంచి సందర్శకులు వాహనాలపై రావడంతో ఈ ప్రాంతం కోలాహలంగా మారింది.

యూపీ అదనపు డీజీపీతో ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో యుపీ అడిషనల్ డీజీపీ కిల్లాడ సత్యనారాయణ

నర్సీపట్నం: తోటి పూర్వ విద్యార్థులతో ఉత్తరప్రదేశ్ అడిషనల్ డీజీపీ కిల్లాడ సత్యనారాయణ సరదాగా గడిపారు. నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడిషనల్ డీజీపీ సత్యనారాయణ 1983–85 బైపీసీ ఇంటర్మీడియేట్ చదివారు. ఆయన రాకను పురస్కరించుకుని అడిషనల్ డీజీపీతో ఇంటర్ చదివిన విద్యార్థులు సమావేశమై ఆయనను ఆహ్వానించారు. తనతో చదివిన పూర్వ విద్యార్థుల పిలుపు మేరకు వారితో సమావేశమైన సత్యనారాయణ వారందరితో ఆత్మీయంగా కలిసిపోయారు. ఆ అధికారి ఇంటర్‌లో ఫెయిలైనా ఐపీఎస్ సాధించి అడిషనల్ డీజీపీ స్థాయికి ఎదగడంపై పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఆయనతో ఫోటోలు దిగేందుకు పోటీ పడ్డారు. సుమారు రెండు గంటల పాటు ఆయన పూర్వ విద్యార్థులతో గడిపారు. తోటి విద్యార్థులకు ఏ అవసరమొచ్చినా వాట్సాప్‌లో మెసేజ్ పోస్టు చేస్తే స్పందిస్తానని భరోసా ఇచ్చారు. పూర్వ విద్యార్థుల తరుపున ఏ కార్యక్రమం తలపెట్టినా తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,139 పోస్టులు

- జోనల్ స్థాయిలో మరో 400 పోస్టులు
- డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్షలు



పౌరగ్రంథాలయంలో పరీక్షకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయ అభ్యర్థులు

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సిద్ధమైంది. ఆదివారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పరిధిలోని పాఠశాలల్లో 734 పోస్టులు, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో 400 పోస్టులు భర్తీ చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని జువనైల్ హోమ్‌లో ఐదు ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. మొత్తంగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 1,139 పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇవి కాకుండా జోనల్ స్థాయిలో ఏపీ రెసిడెన్షియల్/మోడల్ స్కూల్స్/ సోషల్ వెల్ఫేర్/బీసీ వెల్ఫేర్/ట్రైబల్ వెల్ఫేర్(గురుకులాలు) పరిధిలోని విద్యాలయాల్లో 400 పోస్టులను భర్తీ చేయనున్నారు.

రోస్టర్ పాయింట్లు ప్రకటించిన జిల్లా విద్యాశాఖ

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనుంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని విద్యాలయాల్లో సబ్జెక్టుల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది విద్యాశాఖాధికారులు ఇప్పటికే లెక్క తీశారు. మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల వారీగా రోస్టర్ పాయింట్లు సైతం ప్రకటించారు. ప్రభుత్వ/జెడ్పీ/ఎంపీ/మున్సిపల్ మేనేజ్‌మెంట్ పరిధిలో భర్తీ చేయనున్న 734 పోస్టుల్లో 290 ఓపెన్ కేటగిరీ కోసం కేటాయించారు. ఈ పోస్టులకు ఎవరైనా పోటీ పడవచ్చు. బీసీ ఏ–42, బీసీ బీ–65, బీసీ సీ–6, బీసీ డీ–44, బీసీ ఈ –26, ఎస్సీ గ్రూప్ 1-26, ఎస్సీ గ్రూప్ 2-7, ఎస్సీ గ్రూప్ 3-36, ఎస్టీ–37, ఈడబ్ల్యూఎస్–65 పోస్టులు కేటాయించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు ఏఏ సబ్జెక్టుల్లో ఎన్ని పోస్టులు కేటాయించామనేది స్పష్టత ఇస్తూ.. జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచారు.

షెడ్యూల్ ఇలా.. : 2024 జూలై 1 కటాఫ్‌గా 18 నుంచి 44 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ కేటగిరీల వారికి మరో ఐదేళ్లు సడలింపు ఇచ్చారు. తగిన విద్యార్హతలు ఉన్న వారు మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. గత నోటిఫికేషన్ సమయంలో దరఖాస్తు చేసుకున్న వారు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ వారంతా కొత్తగా దరఖాస్తు ఫారాన్ని నింపి వెబ్ సైట్‌లో సబ్మిట్ చేయాలి. అయితే అర్హతల మేరకు మరేదైనా సబ్జెక్టు కోసం పరీక్ష రాయాలనుకుంటే.. తగిన ఫీజు చెల్లించి, మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

సబ్జెక్టుల వారీగా ఖాళీలు ఇలా..

సబ్జెక్టు	ఖాళీలు
ఎస్ఏ లాంగ్వేజీ-1	26
హిందీ	28
ఇంగ్లీష్	55
గణితం	59
ఫిజికల్ సైన్స్	39
బయాలజీ	58
సోషల్	91
పీఈటీ	139
ఎస్జీటీ	239
మొత్తం	734

ట్రైబల్ వెల్ఫేర్‌లో..

సబ్జెక్టు	ఖాళీలు
ఎస్ఏ తెలుగు	7
హిందీ	11
గణితం	7
ఫిజికల్ సైన్సు	35
సోషల్	5
ఎస్జీటీ	335
మొత్తం	400

జువనైల్ విభాగంలో

సబ్జెక్టు	ఖాళీలు
ఎస్జీటీ	4
పీఈటీ	1

జోనల్ పరిధిలో పోస్టులు ఇలా..

ఉత్తరాంధ్రలోని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో జోనల్ ప్రాతిపదికన 400 పోస్టులు భర్తీ చేయనున్నారు.

పీజీటీ	73	పీడీ	6
టీజీటీ	299	పీఈటీ	22

టాప్ లేపుతున్న పాలిటెక్నిక్ పిడుగులు

- మూడేళ్ల చదువుతో ఉద్యోగాలు సాధిస్తున్న విద్యార్థులు
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు
- శతశాతం ఉత్తీర్ణత, ఉద్యోగాలు

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు చదువులో రాణిస్తూ.. ఉద్యోగాలు సాధిస్తున్నారు. ప్రైవేటుకు దీటుగా తమ సత్తా చాటుకుంటున్నారు. అనకాపల్లి మండలం రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులందరికీ ఈ ఏడాది క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు వచ్చాయి. ఇంకా పట్టా చేతికి రాకుండానే వారు కొలువులు సాధించారు. అలాగే నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కూడా పలు సంస్థల్లోని ఉద్యోగాలకు ఎంపికయ్యారు.


స్కిల్‌హబ్, ల్యాబ్స్ బ్లాక్

తుమ్మపాల/నర్సీపట్నం: ఇటీవల కాలంలో పిల్లల ఉన్నత చదువులు.. అనంతరం కొలువులు తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారాయి. 1 నుంచి 10వ తరగతి వరకు ఒక లెక్క తర్వాత మరో లెక్క అన్నట్లు ప్రస్తుత విద్యా విధానం ఉంది. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఆస్తులు అమ్మయినా చదివించాలనే తపన తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. ఈ దశలో టెన్త్ తర్వాత పాలిటెక్నిక్ కళాశాలలో మూడేళ్ల డిప్లొమా ఎంతో ఉపయుక్తంగా ఉంది. ఉద్యోగ సాధనలో గడ్డు కాలం నడుస్తున్న ప్రస్తుత దశలో కూడా ఈ ఏడాది రేబాక, నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు కొలువులు సాధించి, ప్రత్యేకత చాటుకున్నారు. ముఖ్యంగా రేబాక కాలేజీలో నూరు శాతం ప్లేస్‌మెంట్స్‌తో మొత్తం 121 మందికి మంచి మంచి ఉద్యోగాలు లభించాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసి కళాశాలల రూపురేఖలు మార్చేసింది. నిష్ణాతులైన అధ్యాపకులతో పాటు అధునాతన పరికరాలతో తరగతి గదులు, ల్యాబ్‌లు, కంప్యూటర్లతో పాటు సాంకేతికత జోడించి విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసింది. విద్యార్థులు నైపుణ్యం కలిగి ఉండటంతో ప్రస్తుతం పాలిటెక్నిక్ డిప్లొమాకు మార్కెట్‌లో


రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముఖద్వారం

మంచి డిమాండ్ ఏర్పడింది. కార్పొరేట్ కళాశాలల్లో చదివిన విద్యార్థుల కన్నా పాలిటెక్నిక్ డిప్లొమా చేసిన విద్యార్థులనే పలు కంపెనీలు తమ ఉద్యోగులుగా స్వీకరిస్తున్నాయి.

రేబాక పాలిటెక్నిక్ కళాశాల ప్రత్యేకతలెన్నో..

అనకాపల్లిలో కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో రేబాక గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అనతి కాలంలోనే జాతీయ స్థాయి గుర్తింపు సాధించింది. నిష్ణాతులైన అధ్యాపకులు, అధునాతన టెక్నాలజీ గల ల్యాబ్స్, స్కిల్ హబ్ నిర్వహణతోపాటు ఎన్‌బీఏ అక్రిడేషన్ అర్హత 2023–24 నుంచి 2025–26 వరకు పొందిన ఏకైక కళాశాలగా పేరొందింది. కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న 121 మంది విద్యార్థులు ఉద్యోగం, ఉన్నత చదువుల హామీతో బయటకు వెళ్తున్నారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ల్యాబ్స్‌పై పట్టు ఉండేలా ఇక్కడ విద్యార్థులను తయారు చేస్తున్నారు. ఇండస్ట్రీ రిలేటెడ్ సిలబస్‌పై శిక్షణ ఇస్తున్నారు. దీంతో థాట్ వర్క్స్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ వంటి టాప్ సంస్థలు డిప్లొమా విద్యార్థులను ఎంపిక చేసుకోవడంపై మక్కువ చూపిస్తున్నాయి.


కళాశాలలో డిప్లొమా తరగతుల బ్లాక్

ఉద్యోగాలు అందిపుచ్చుకుంటున్న నర్సీపట్నం విద్యార్థులు

నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉద్యోగాలు అందిపుచ్చుకుంటున్నారు. ఈసీఈ, మెకానికల్, మైనింగ్ విభాగాల్లో విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తున్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు అత్యధిక ఉద్యోగాలు సాధిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో సాంకేతిక విద్య పూర్తి చేసిన విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. ఈసీఈ నుంచి 50 మంది, మెకానికల్ 39 మంది, మైనింగ్‌లో ఆరుగురు కొలువులు సాధించారు. చెన్నై నగరంలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ, లోటస్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్‌లు చాలా మందికి అవకాశమిచ్చాయి. ఒ.భాస్కరరావు అనే విద్యార్థి మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్‌లో కొలువు సాధించి ఏడాదికి రూ.4.75 లక్షల జీతం పొందుతున్నాడు. హైదరాబాద్‌కు చెందిన మేధా సరోవర్ డ్రైవ్ ప్రయివేట్ లిమిటెడ్ తదితర ప్రముఖ కంపెనీల్లో విద్యార్థులు కొలువులు సాధించారు.

ఏడాదికి రూ.8.2 లక్షల ప్యాకేజీ



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చేస్తున్నాను. మా కళాశాలలో చదువుతో పాటు ల్యాబ్స్, కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించేలా నిరంతరం బోధిస్తున్నారు. పలు కంపెనీల ప్లేస్‌మెంట్స్ కూడా ఇక్కడే నిర్వహించడంతో నేను ఎలక్ట్రానిక్స్‌లో టాప్ కంపెనీ అయిన థాట్‌వర్క్స్‌– బెంగళూర్‌కు ఎంపికయ్యాను. ఏడాదికి రూ.8.2 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం పొందడం చాలా ఆనందంగా ఉంది. –జి.దిల్లేశ్వరరావు, ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థి, రేబాక

ఉద్యోగం.. ఉన్నత చదువు



ఈసీఈ డిప్లొమా కోర్సులో ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. కళాశాలలో జరిగిన ప్లేస్‌మెంట్స్ ఇంటర్వ్యూలో మేధా సర్వో కంపెనీలో ఏడాదికి రూ.3.2 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం పొందాను. ఉన్నత చదువుకు కూడా అవకాశం కల్పించారు. అధ్యాపకులు, ప్రిన్సిపల్ ప్రోత్సాహంతోనే మూడేళ్లకే ఉద్యోగం సాధించగలిగాను. నాతో పాటు మా క్లాస్‌లో ఉన్న అందరికీ పలు కంపెనీల ద్వారా ఉద్యోగాలు వచ్చాయి. –ఎస్.హారిక, ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థిని, రేబాక

సులువుగా ఉద్యోగం సాధించవచ్చు...



పాలిటెక్నిక్ పూర్తిచేసిన తరువాత సులువుగా ఉద్యోగ అవకాశాలు వస్తాయి. చాలా మంది విద్యార్థులు పలు కంపెనీల్లోని ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. విద్యార్థులు సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. ఇంటర్ అయ్యాక ఇంజనీరింగ్ చదవడం కంటే డిప్లొమా చేసి ఇంజనీరింగ్ చేస్తే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. –సిహెచ్.వి.నర్సింహులు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్, నర్సీపట్నం

ఉద్యోగంతోపాటు బీటెక్ చదివే అవకాశం



మాది రోలుగుంట మండలం, బుచ్చంపేట గ్రామం. పదో తరగతి అయిన వెంటనే నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ గ్రూపులో చేరాను. ఆఖరి ఏడాది నిర్వహించిన జాబ్ మేళాలో హైదరాబాద్‌కు చెందిన మేధా సరోవర్ డ్రైవ్ ప్రయివేట్ లిమిటెడ్‌కు ఎంపికయ్యాను. ఏడాదికి 2.3 లక్షల ప్యాకేజీ వరించింది. ఉద్యోగం చేసుకుంటూనే బీటెక్ చదువుకునేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాను. –శెట్టి అప్పలనాయుడు, నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాల

శత శాతం ప్లేస్‌మెంట్స్ సాధించాం



మా కళాశాలలో డిప్లొమా చేస్తున్న ప్రతి విద్యార్థి ఉద్యోగంతో బయటకు వెళ్లాలనే లక్ష్యంతో బోధన అందిస్తున్నాం. నిష్ణాతులైన అధ్యాపకులు, ఆధునిక సాంకేతికత, ల్యాబ్స్ కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్‌కు మంచి డిమాండ్ ఉండటంతో టాప్ కంపెనీలు సైతం నైపుణ్యం ఉన్న డిప్లొమా విద్యార్థుల పట్ల ఆసక్తి చూపుతున్నాయి. కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి కళాశాలలోనే నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించేలా చేశాం. ఈ ఏడాది శత శాతం ఉద్యోగాలు సాధించాం. –ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రేబాక

క్లుప్తంగా

హోటళ్లు, లాడ్జీల ఆకస్మిక తనిఖీలు


పట్టణంలోని మెయిన్‌రోడ్డులో లాడ్జి రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: అనుమానిత వ్యక్తులు లాడ్జిల్లో ఉన్నట్టయితే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని డీఎస్పీ ఎం.శ్రావణి అన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పట్టణంలో పలు హోటళ్లు, లాడ్జిలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనిఖీల్లో అనుమానితుల వివరాలను సేకరించడం, హోటళ్లు, లాడ్జీల లాగ్ బుక్‌లను పరిశీలించడం, గుర్తింపు పత్రాల నమోదు విధానం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లాడ్జీ యాజమాన్యం రికార్డులు తప్పని నమోదు చేసుకోవాలన్నారు. మహిళల భద్రత, శాంతి స్థాపన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడం జరుగుతుందన్నారు. అనుమానితులు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.వి. విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు హర్షణీయం


ఎంవీ రాజశేఖర్

దాబాగార్డెన్స్: భగవద్గీతను యునెస్కో గుర్తించడం హర్షణీయమని గీతా ప్రచార సమితి ప్రతినిధి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ అన్నారు. కురుక్షేత్ర మహా సంగ్రామంలో శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి ఉపదేశించిన భగవద్గీత ఆవిర్భవించి వేల సంవత్సరాలు అవుతున్నా.. ఇప్పటికీ భగవద్గీత భక్తి జ్ఞానములతో కూడిన శోభ చెక్కు చెదరలేదన్నారు. ప్రపంచ దేశాలన్నీ విశ్వసిస్తున్న అత్యున్నతమైన ఆధ్యాత్మిక గ్రంథం భగవద్గీతేనన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మంగా జీవించాలన్నా, ధర్మాన్ని ఆచరించాలన్నా భగవద్గీతను అనుసరించాల్సిందేనన్నారు. విశ్వానికంతటికీ ఎన్నో విధాలుగా.. సగటు జీవికి అనేక రకాలుగా దిక్సూచిగా, మార్గదర్శిగా జీవన ప్రయాణంలో భగవద్గీత భాగంగా ఉందని పేర్కొన్నారు. సంపూర్ణ గీతా సారాంశం తెలుసుకుని జీవించాలని పిలుపునిచ్చారు.

నితీష్‌కుమార్ రెడ్డికి బీసీసీఐ కాంట్రాక్ట్?

విశాఖ స్పోర్ట్స్: విశాఖకు చెందిన యువ ఆల్‌రౌండర్ కాకి నితీష్‌కుమార్ రెడ్డికి బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టు లభించనున్నట్లు బలమైన సంకేతాలు అందుతున్నాయి. తద్వారా విశాఖ నుంచి బీసీసీఐ కాంట్రాక్టు దక్కించుకున్న రెండో ఆటగాడిగా నిలిచే అవకాశం ఉంది. 21 ఏళ్ల నితీష్ ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌తో టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో 5 టెస్టులు ఆడి 298 పరుగులు, 5 వికెట్లు తీసి సత్తా చాటాడు. నాలుగో టెస్ట్‌లో తొలి సెంచరీ నమోదు చేశాడు. అంతకు ముందు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున నిలకడైన ప్రదర్శన చేయడం జాతీయ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించింది. ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా ఏటా బీసీసీఐ ఇచ్చే కాంట్రాక్టు జాబితాలో నితీష్‌కు 'సీ' గ్రేడ్ కేటాయించే అవకాశం ఉంది. ఈ కేంద్ర కాంట్రాక్టు దేశవాళీ క్రికెటర్లకు ఆర్థికంగా, వృత్తి పరంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

దేవరాపల్లిలో తమ్ముళ్ల మధ్య భగ్గుమన్న విభేదాలు

- చంద్రబాబు జన్మదిన వేడుకల సాక్షిగా బయటపడ్డ వర్గపోరు
- రెండు వర్గాలుగా విడిపోయిన మండల టీడీపీ నేతలు
- పీహెచ్‌సీలో వేర్వేరుగా రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ


పార్టీ తీరుపై బాహాటంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్న టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కొమర బాబూరావు

దేవరాపల్లి: దేవరాపల్లిలో ఆదివారం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకల్లో తమ్ముళ్ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. రైవాడ అతిథి గృహంలో జన్మదిన కేక్ కట్ చేసే సమయంలో పాత, వలస టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా వివాదం నెలకొంది. ఈ క్రమంలో పాత, వలస టీడీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న టీడీపీ గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల నియామకాల్లో పాత టీడీపీ వర్గీయులకు అవకాశం కల్పించకుండా, ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికి పెద్ద పీట వేయడం పట్ల పలువురు పాత టీడీపీ నాయకులు నిలదీశారు. ఈ క్రమంలోనే రెండు వర్గాల మధ్య స్వల్ప మాటల యుద్ధం జరిగింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎంపికలో సైతం పార్టీ కష్టకాలంలో జెండా మోసిన వారికి కాకుండా, వలస నేతలకు పదవులు కట్టబెట్టడంపై పాత సీనియర్ టీడీపీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కొమర బాబూరావు మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి, జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకు తమ పార్టీలో విలువ లేకుండాపోతుందని బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేయడమే ఇందుకు నిదర్శనం. కొందరు నేతలు ఎవరితో చర్చించకుండా పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ పార్టీకి చేటు కలిగిస్తున్నారని పలువురు సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిష్టానం జోక్యం చేసుకోకుంటే మండలంలో పార్టీకి నష్టం కలుగుతుందని బాహాటంగా ఆవేదన వ్యక్తం చేశారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- నూకాంబికకు ప్రత్యేక పూజలు.. మొక్కుల చెల్లింపు
- అమ్మ సన్నిధిలోనే వంటా వార్పు.. భోజనాలు
- ఏర్పాట్లు చేసిన ఆలయ వర్గాలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిళ్ల కింద వంటలు చేసుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి నెల పండగలో భాగంగా ఆదివారం అమ్మవారిని కుటుంబ సమేతంగా భక్తులు దర్శించుకున్నారు. విద్యార్థులకు పరీక్షలు ముగియడం, కొన్ని పాఠశాలలు సెలవులు ప్రకటించడంతో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటకాలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత తాగునీరు, మజ్జిగ, అమ్మవారి ప్రసాదం అందజేశారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు టి.వి.విజయకుమార్, ఎం.వెంకటనారాయణ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ధర్మకర్తలు ఎర్రవరపు లక్ష్మి, కోనేటి సూర్యలక్ష్మి, వడ్డాది మంగ, కొడుకుల శ్రీకాంత్, సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, మజ్జి శ్రీనివాసరావు, కాండ్రేగుల రాజారావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు..

నూకాంబిక అమ్మవారిని ఏపీఈపీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్, జేసీ జాహ్నవి దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈవో వెంపలి రాంబాబు శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

అనకాపల్లి బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, చైర్మన్ పి.ఎస్.అప్పారావు, అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న సమ్మె

సిటు అఖిల భారత అధ్యక్షురాలు హేమలత



సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

దాబాగార్డెన్స్: కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న తలపెట్టిన అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిటు రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమేనని హేమలత విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి, యజమానుల శ్రమ దోపిడీని పెంచడానికి, అక్రమ తొలగింపులు, పని భారాన్ని ప్రశ్నించకుండా చేయడానికి, పని గంటలు పెంచడానికే ఈ కోడ్‌లు ఉద్దేశించినవని ఆరోపించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు మారుస్తూ.. కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని, కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తోందని ఆమె ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వేగవంతం చేయడం దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమేనని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు పెంచి, పని భారం తగ్గించాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడానికే వక్ఫ్ చట్టంలో మార్పులు చేసిందన్నారు. సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 12–14 గంటలకు పెంచే ప్రయత్నం జరుగుతోందని, పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణను ఆపి, భారాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిటు అఖిల భారత ఉపాధ్యక్షురాలు బేబీరాణి, రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, అజయ్‌కుమార్, కె.సుబ్బరావమ్మ, కె.ధనలక్ష్మి, ముజఫర్ అహ్మద్, రమాదేవి, ఆర్.వి.నర్సింగరావు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, డీఎస్‌వీడీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అండర్–7 చెస్ జట్టుకు ధనుష్, ధియా ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: అండర్–7 అంతర జిల్లాల చదరంగం జట్టు ఎంపిక పోటీల్లో విశాఖకు చెందిన ధనుష్ (ఓపెన్ విభాగం), ధియా తేజశ్రీ బుద్ధ (బాలికల విభాగం) రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారు. వీరు పల్నాడు జిల్లాలో జరగనున్న స్టేట్ అంతర జిల్లాల అండర్–7 చాంపియన్‌షిప్‌లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆల్ విశాఖ చదరంగం సంఘం ఆధ్వర్యంలో గాయత్రి విద్యా మందిర్‌లో ఆదివారం ఈ ఎంపిక పోటీలు జరిగాయి. ఓపెన్ విభాగంలో 23 మంది, బాలికల విభాగంలో 13 మంది చిన్నారులు పోటీపడ్డారు. ఓపెన్‌లో ఐదు రౌండ్లు, బాలికల కోసం నాలుగు రౌండ్లు నిర్వహించారు. ఓపెన్ విభాగంలో ధనుష్ పిల్ల ఐదు రౌండ్లలో నాలుగున్నర పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. ద్వితీయ స్థానంలో నిలిచిన అభినవ వైద్య భూషణ నాలుగు పాయింట్లు సాధించాడు. వీరిద్దరూ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఐదు రౌండ్ల తర్వాత బి.విఖ్యాత్, ఎ.కార్తికేయ, నిహాస్ దొగ్గాలు కూడా నాలుగేసి పాయింట్లతో నిలిచినా ప్రోగ్రెసివ్ స్కోరు ఆధారంగా వారు వెనుకబడిపోయారని నిర్వాహకులు తెలిపారు. బాలికల విభాగంలో ధియా తేజశ్రీ బుద్ధ నాలుగు రౌండ్లలోనూ విజయంతో నాలుగు పాయింట్లు సాధించింది. మూడు పాయింట్లు సాధించిన అదిత్రి ద్వితీయ స్థానంలో నిలిచింది. తేజోసన్విక, అదిత్రితో సమానంగా పాయింట్లు సాధించినా.. ప్రోగ్రెసివ్ స్కోరు కారణంగా అర్హత సాధించలేకపోయింది. ఓపెన్, బాలికల విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. జిల్లా స్థాయి అండర్–7 ఓపెన్‌లోనూ, బాలికల్లోనూ తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి జిల్లా జట్టుగా అర్హత కల్పించినట్లు సంఘం కార్యదర్శి మణికంఠ తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


వేదికపై సందడి చేస్తున్న చౌర్యపాఠం చిత్ర నటీనటులు, దర్శకుడు తదితరులు

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయం నెల రోజుల ఉత్సవంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఆదివారం రాత్రి చైతన్య బ్రదర్స్ నిర్వహించిన క్లాసికల్ భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు పీవీకే జగన్నాథరావు, పి. శ్రీదేవి, విశాలాక్షి మహంతిలకు ఉగాది పురస్కారాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అందజేశారు. అలాగే చౌర్యపాఠం మూవీ టీం వేదికపై హల్‌చల్ చేసింది. చిత్ర యూనిట్ హీరో ఇంద్ర, హీరోయిన్ పాయల్, డైరెక్టర్లు నిఖిల్, నక్కిన త్రినాథరావు, నటుడు రాజీవ్ కనకాల తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పీలా గోవింద తదితరులు పాల్గొన్నారు. అలాగే హరేకృష్ణ సత్సంగ ఆశ్రమం ఆధ్వర్యంలో గవరపాలెం గౌరీ సంఘం నుండి ఎన్టీఆర్ గ్రౌండ్ వరకు ఇస్కాన్ పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా మహిళలు హరే రామ హరేకృష్ణ అంటూ బృందగానం చేశారు.

ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి సినిమాలు చూడాలి

సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు


సినీ దర్శకుడు త్రినాథరావును సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి సినిమా చూసినంత కాలం చిత్ర పరిశ్రమకు ఎంతో ఆదరణ ఉంటుందని సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు పేర్కొన్నారు. కళాకారులను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. మునగపాకలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్లేస్కూల్‌ను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తాను నిర్మించే పలు చిత్రాల్లో స్థానిక కళాకారులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. తమలో ఉన్న కళను వెలికి తీసేందుకు సినిమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. తాను గతంలో దర్శకత్వం వహించిన పలు సినిమాలకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ వచ్చిందన్నారు. ధమాకా, నేను లోకల్, మజాకా, సినిమా చూపిస్తా మామ.. వంటి సినిమాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయన్నారు. తాను నక్కిన నరేటివ్ ప్రొడక్షన్‌లో నిర్మిస్తున్న 'చౌర్యపాఠం' సినిమా ఈ నెల 25న విడుదల కానుందని తెలిపారు. ప్రస్తుతం 'అనకాపల్లి' చిత్రం కూడా శరవేగంగా షూటింగ్ జరుగుతుందన్నారు. ఈ సినిమాకు ఖగేష్ దర్శకత్వం వహిస్తున్నారని, హీరోగా లగడపాటి విక్రమ్ నటిస్తున్నారన్నారు. సమాజానికి మంచి చేకూరే కథతో ఈ సినిమా షూటింగ్ జరుగుతుందన్నారు. ప్రేక్షకుల ఆశీర్వాదం ఉన్నంత కాలం సినిమాలకు మంచి ఆదరణ దొరుకుతుందని త్రినాథరావు తెలిపారు. ఆయన వెంట శీలా జగన్నాథరావు మాస్టారు ఉన్నారు.

క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న మహిళ అరెస్టు

అనకాపల్లి టౌన్: మండలంలోని మార్టూరు గ్రామంలో ఆదివారం అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ జి. రవికుమార్ తెలిపారు. ఆమె నుంచి 10 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ప్రమాదమని తెలిసినా..?



ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ చుట్టూ దిష్టిబొమ్మలు, ఇతర వస్తువులు

అనకాపల్లి: పట్టణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వ్యాపారులకు నిలయంగా మారాయి. ప్రమాదం అని తెలిసినప్పటికి వాటి వద్ద గొడుగులు వేసుకుని మరీ వ్యాపారం సాగిస్తున్నారు. పట్టణంలో పెరుగు బజార్ జంక్షన్ వద్ద గృహాలకు ఉపయోగించే దిష్టిబొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్లు దిమ్మలకు చుట్టూ కట్టి వ్యాపారం సాగిస్తున్నారు. మెయిన్‌రోడ్డులో కన్యకాపరమేశ్వరి ఆలయ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పెద్దపాటి గొడుగు వేసుకుని 15 సంవత్సరాలు వ్యాపారం సాగుతోంది. విద్యుత్‌శాఖ అధికారులు పర్యవేక్షణ లోపంతో వ్యాపారులు ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మలను వ్యాపారానికి ఉపయోగిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో రెండుసార్లు ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు రెండు రోజులు హడావుడి చేసి వదిలేశారు. వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి విద్యుత్ శాఖ ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని పాదచారులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

పెందుర్తి: పాఠశాల నుంచి ఇంటికి బయలుదేరి అదృశ్యమైన ఓ బాలుడి ఆచూకీని పెందుర్తి పోలీసులు 24 గంటల్లో కనుగొన్నారు. బాలుడ్ని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలివి.. సుజాతనగర్లో నివాసం ఉంటున్న బాలుడు(14) పాపయ్యరాజుపాలెం లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లి, మధ్యాహ్నం సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆదివారం ఉదయం పెందుర్తి సమీపంలో గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులను పిలిపించి ఆ బాలుడ్ని అప్పగించారు.

హైవేపై డ్రోన్‌తో నిఘా



డ్రోన్ కెమెరాతో తీసిన చిత్రం

పాయకరావుపేట: పట్టణ జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యను డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. ఈసాంఘిక కార్యకలాపాలను పరిశీలిస్తున్నామన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: మ్యాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1:	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 :	గుడ్ అండ్ బ్యాడ్ అగ్లీ
పర్తిసాయి	: ఓదెలా-2
షిర్డీసాయి	: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర	: కోర్టు
శ్రీసత్య	: మధురం
రామచంద్ర	: జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్ , బీ పాజిటివ్-3, ఓ పాజిటివ్-17, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 291 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 232 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

మామిడి రైతు దిగాలు



కశింకోట:

అకాల వర్షాలు కురవడం, తేనె మంచు ప్రభావంతో మామిడి పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. మండలంలో ఈ ఏడాది మామిడి సాగు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. వాతావరణం అనుకూలించక కాయ కాపు తగ్గిపోయింది. ఏ కాస్తో కాసిన చోట కాయ ఎదుగుదల లేదు. దీంతో మామిడి రైతులు దిగాలు చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని మదన పడుతున్నారు. మండలంలో 400 ఎకరాల్లో పంట సాగవుతోంది. ప్రధానంగా కన్నూరుపాలెం, తీడ, చెరకాం, అడ్డాం , నూతలగుంటపాలెం, విసన్నపేట, జి.భీమవరం, సుందరయ్యపేట, అచ్చెర్ల, బయ్యవరం, కశింకోట, తేగాడ, కొత్తపల్లి తదితర గ్రామాల్లో మామిడి సాగవుతోంది. బంగినపల్లి, సువర్ణరేఖ, కలెక్టర్ తదితర రకాల మామిడి ఎక్కువగా సాగు చేస్తున్నారు.

కాపు లేక పెట్టుబడి రాని పరిస్థితి..

ఈ ఏడాది పూత బాగా వచ్చినప్పటికీ అకాల వర్షాలు కురవడం, తేనె మంచు పురుగు ఆశించడంతో అది దెబ్బతిని పింజ కట్టలేదు. దీంతో కాయ దిగుబడి తగ్గిపోయింది. పైగా కాయ ఎదుగుదల కూడా లేదు. ఇప్పటికే కోతకు రావలసి ఉండగా ఇంకా ఎదుగుదల దశలోనే ఉన్నాయి. దీంతో మామిడి సాగు రైతులు, కౌలుకు తీసుకున్న వారు మామిడి కాయల కాపు లేక ఈ ఏడాది పెట్టిన పెట్టుబడి రాని పరిస్థితి ఉందని వాపోతున్నారు. పూతకు ముందు దుక్కి దున్ని, చెట్లకు నీరు నిల్వ ఉండటానికి పాదులు ఏర్పాటు చేసి ఎరువులు వేసి, క్రిమి సంహారక మందులు వేశారు. ఎకరాకు రూ. 20 నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. అయినా కాయ కాపు లేక పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది పెట్టుబడి పోనూ ఎకరాకు రూ.20 వేల వరకు మిగిలిందని, ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేదని నిట్టూరుస్తున్నారు. వీటిని స్థానికంగా విక్రయించడంతోపాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి వ్యాపారులకు విక్రయిస్తారు.

అయితే ఆశించిన ధర కూడా లేదని, కిలో రూ.35 రావడం కష్టంగా ఉందంటున్నారు. ఇలా అయితే ఈ ఏడాది తాము అర్థాకలితో అలమటించాల్సిందేనని వాపోతున్నారు. ప్రభుత్వం తమకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



కన్నూరుపాలెంలో మామిడి సాగు



సరైన కాపు కాయని మామిడి



ఎదుగుదల లేని మామిడికాయ

పూత దెబ్బతిని నష్టం



2.70 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నాను. రూ.35 వేల పైబడి పెట్టుబడి పెట్టాను. బాగానే పూత పూసినప్పటికి అకాల వర్షాలు పడటం, మంచు ఎక్కువగా పడటం వల్ల తేనె మంచు పురుగు ఆశించడం వల్ల పూత దెబ్బతింది. గతేడాది పెట్టుబడి పోనూ రూ.20 వేల వరకు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించక రూపాయి ఆదాయం వచ్చే పరిస్థితి లేదు.

-వై. రాము, మామిడి రైతు, కన్నూరుపాలెం

నష్ట పరిహారం ఇవ్వాలి



రెండున్నర ఎకరాల్లో బంగినపల్లి, సువర్ణరేఖ వంటి రకాలు పండిస్తాను. రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టాను. వాతావరణం అనుకూలించక పూత దెబ్బతిని కాపు కాయలేదు. దమ్మిడి ఆదాయం వచ్చే పరిస్థితి లేదు. ఇదే గత ఏడాది పెట్టుబడి పోనూ రూ.30 వేల వరకు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది ఎలా కుటుంబాన్ని నెట్టుకురావాలో తెలియడం లేదు. ప్రభుత్వం పంట నష్టానికి పరిహారం అందించి ఆదుకోవాలి.

- యర్రంశెట్టి రాజు, మామిడి రైతు, కన్నూరుపాలెం

నూకాంబికకు ప్రత్యేక పూజలు



కశింకోటలో నూకాంబిక అమ్మవారికి పూజలు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. వారపు పొద్దు కావడంతో ఎక్కువ మంది తరలివచ్చి దర్శించుకుని చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివగణేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కొంతమంది భక్తులు కుటుంబ సభ్యులు, బంధువులతో జాతర, గంప జాతర జరుపుకొని ఆనందంగా గడిపి వెళ్లారు.

26న హనుమాన్ శోభాయాత్ర

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఈ నెల 26న హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్టు విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు నుదురుపాటి తాతాజీ తెలిపారు. ఈ ర్యాలీ సుంకరమెట్ట సూర్యనారాయణ మూర్తి ఆలయం నుంచి శారదా బ్రిడ్జి వరకు జరుగుతుందన్నారు. హిందువులందరూ తప్పనిసరిగా పాల్గొన్నాలని కోరారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్నిమాపకశాఖ కార్యాలయంలో పరికరాలు వద్ద సిబ్బంది



అనకాపల్లి అగ్నిమాపక శాఖ కార్యాలయం

అనకాపల్లి: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ వారోత్సవాలను పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆ శాఖ అధికారులు నిర్వహించారు. మాక్‌డ్రిల్ ద్వారా ప్రమాదాలు జరిగే సమయంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రజల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా మానవుని తప్పిదాలు కారణంగా జరుగుతున్నాయని అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారి పి.నాగేశ్వరరావు తెలిపారు. చిన్నపాటి నిబంధనలు పాటించినట్లయితే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో గృహాల్లో విద్యుత్‌ను అధికంగా వాడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వారం రోజుల పాటు పట్టణంలో అపార్టుమెంట్లు, షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గొడౌన్ల వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

ఖాళీ జాగా... వేసెయ్ పాగా!

- గెడ్డపోరంబోకులో అక్రమ నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు

నర్సీపట్నం : మండలంలో వేములపూడి మేజర్ పంచాయతీలో స్థలాల విలువ పెరగడంతో ఖాళీ స్థలాలు కనబడితే పాక వేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురువుతున్నా పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. గ్రామ మెయిన్ రోడ్డులో సెంటు స్థలం రూ.15 లక్షల నుండి రూ.20 లక్షలు పలుకుతుంది. దీంతో ఖాళీ స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న సెంటున్నర గెడ్డపోరంబోకు స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమించి రేకుల షెడ్డు నిర్మించాడు. గతంలో షెడ్డు నిర్మాణానికి పాల్పడితే రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. కొన్ని నెలలు మిన్నకుండి ఈ రెండు, మూడు రోజుల్లో పోరంబోకు స్థలంలో పర్మనెంట్‌గా షెడ్డు నిర్మాణం జరిగిపోయింది. నిత్యం అదే మార్గంలో సచివాలయానికి వెళ్లే పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో చూసీచూడనట్టు వ్యవహరించడంతో ఆక్రమణదారు దర్జాగా నిర్మాణం చేశాడు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు మేలుకోకపోతే గ్రామంలోని రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయమై వీఆర్వో నవీన్‌ను సంప్రదించగా నిర్మాణం చేయవద్దని చెప్పినా రాత్రి వేళల్లో నిర్మాణం పూర్తి చేశాడని, ఆక్రమణ విషయాన్ని తహసీల్దార్ రామారావు దృష్టికి తీసువెళ్లామన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు సోమవారం డిస్మాంటిల్ చేస్తామని వీఆర్వో తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్నందున తాము కూడా నిర్మాణదారుకు నోటీసు ఇస్తామని ఈవో సత్యనారాయణ తెలిపారు.



ప్రధాన జంక్షన్‌కు ఆనుకుని ఉన్న గెడ్డపోరంబోకు స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణం

పార్కు నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం

విచారణకు సీపీఎం నేత వెంకన్న డిమాండ్



దేవరాపల్లిలో నిర్మాణంలో ఉన్న పార్కు

దేవరాపల్లి: స్థానికంగా వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పార్కు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని, సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. పనుల్లో నాణ్యత పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో అన్నారు. ఈ పనుల్లో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం రూ. 22 లక్షలతో ట్రాక్ నిర్మాణ పనులు చేస్తున్నారని, కింద నేల చదును చేయకుండా, రోలింగ్ చేపట్టకుండా తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నారని విమర్శించారు. నాణ్యతా లోపం కారణంగా సీసీ ట్రాక్ తక్కువ రోజుల్లో పగుళ్లు వచ్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పక్కాగా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.40 లక్షలతో ప్రహరీ, ఇతర పనులు చేపట్టగా సార్వత్రిక ఎన్నికల తర్వాత ఈ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తాజాగా ట్రాక్ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

సేవా కార్యక్రమాలతో ఎనలేని కీర్తి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: గ్రామీణ యువజన మందిరం ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టి ఎనలేని కీర్తి పొందాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. నాటకాలకే పరిమితం కాకుండా ప్రజాప్రయోజనాలకు అనువుగా ఉండేలా సేవలందించాలన్నారు. గ్రామీణ యువజన మందిరం నూతన పాలకవర్గ సభ్యులను ఆదివారం ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మునగపాక ఖ్యాతిని ఉభయరాష్ట్రాల్లో ఇనుమడింప చేసిన ఘనత గ్రామీణ యువజన మందిరానికే దక్కుతుందన్నారు. నాటకరంగ అభివృద్ధికి యువజన మందిరం కృషి అభినందనీయమన్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం యువతకు, పిల్లలకు, గ్రామానికి ఉపయోగకరంగా ఉండేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



పాలకవర్గ సభ్యులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



మాట్లాడుతున్న పాస్టర్ మూర్తి జేమ్స్

కశింకోట: మండలంలోని క్రైస్తవులు ఈస్టర్‌ను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏపీ ఆంధ్ర కల్వరి సెంచునరీ బాప్టిస్టు చర్చి, గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం , షాలెం మందిర్ తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుప్రభువు పునరుత్థానుడైన సందర్భంగా వాక్యాలను ప్రవచించారు. కల్వరి బాప్టిస్టు చర్చి పాస్టర్ సన్నీ జేమ్స్, చర్చి కమిటీ ప్రతినిధులు మోజెస్, నాగేశ్వరరావు, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం పాస్టర్ మూర్తి జేమ్స్, విశ్వాసులు కె. శ్యామలరాజు, కె. మదన్‌కుమార్, ఎస్. మధుసూదన్, కె. కృపా వరప్రసాద్, ఎన్. కృపావరం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని చర్చిల్లో ఈస్టర్ నిర్వహించారు.

స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

నర్సీపట్నం: మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును వెలగా నారాయణరావు, టూరిజం మేనేజర్ అప్పలనాయుడు ఆదివారం ప్రారంభించారు. సమ్మర్ క్యాంపునకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని నింజాస్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. పళ్లు, గుడ్లు, బిస్కట్లు, కేకులు, రాగిజావ అందజేస్తామని నారాయణరావు తెలిపారు. సీనియర్ కోచ్ మాట్లాడుతూ 40 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. కరాటే, వుషు, బాక్సింగ్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యెగా వంటి క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రయంలో నింజాస్ అకాడమీ డైరెక్టర్లు వెలగా జగన్నాథం, బోశెం శివ, బంగారు నాయుడు, ఉమెన్ కోచ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు జన్మదిన వేడుక

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను కూటమి శ్రేణులు ఆదివారం నిర్వహించాయి. జి. భీమవరంలో ఉపాధి కూలీల మధ్య మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ కేకు కట్ చేసి పంచిపెట్టారు. కశింకోట, కన్నూరుపాలెం తదితర గ్రామాల్లో ఈ వేడుక నిర్వహించారు.

ఆలయానికి పంచలోహ ఇత్తడి తొడుగు అందజేత



సర్పంచ్ సంజీవరావుకు ఇత్తడి తొడుగు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు గ్రామ ఆరాధ్య దైవం మోదమాంబ ఆలయానికి దాతలు 50 కిలోల పంచలోహ ఇత్తడి తొడుగును సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ద్వారా ఆదివారం అందజేశారు. ఎం. కోడూరు గ్రామానికి చెందిన ముమ్మిన అప్పారావు సోదరులు, వారి కుమారులు, కాకర అప్పారావు కుటుంబ సభ్యులు, సోమిరెడ్డి అప్పారావు కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, పార్వతి దంపతుల ఆర్థిక సహకారంతో 50 కిలోల ఇత్తడితో తయారు చేసిన తొడుగును అందజేశారు. దీని విలువ రూ. 80 వేలు ఉంటుదని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, పడాల అప్పలనాయుడు, ఎస్. సముద్రం, కలిమి గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న బాలేపల్లి వెంకటరమణ



సీపీఐ నూతన కమిటీ మండల కార్యదర్శిగా వియ్యపు రాజు

తుమ్మపాల: కూటమి ప్రభుత్వం హామీలు అమలులో విఫలమైందని, మహిళలకు ఉచిత బస్సు, యువతకు ఉద్యోగాలు నేటికి లేవని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ విమర్శించారు. వెంకుపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన సీపీఐ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలన్నారు. 11 నెలలు పూర్తవుతున్నప్పటికీ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రకటలకే పరిమితం చేస్తున్నారన్నారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు లాంటి దగాకోరు సీఎంను ముందెప్పుడు చూడలేదన్నారు. సీఎం చంద్రబాబు కల్లబొల్లి మాటలు విని ప్రజలు మోసపోయారన్నారు. ఏడేళ్లుగా కోచింగ్ తీసుకుంటున్న యువతకు వయోపరిమితి సడలింపు చేయకుండా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారన్నారు. ప్రజ సమస్యలపై ఉద్యమాలకు వచ్చే నెల 5, 6, 7 తేదీలలో సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు నూతన కమిటీ మండల కార్యదర్శిగా వియ్యపు రాజు, సమితి సభ్యులుగా బోయిన గోవింద, డొక్కరి హరీష్, చెల్లూరి నాగరాజు, ఉరికిటి మహలక్ష్మినాయుడు ఎన్నికయ్యారన్నారు.

ప్రేమ సమాజంలో అదనపు సౌకర్యాలు



అదనపు బెడ్ల ఏర్పాటు

చోడవరం: స్థానిక ప్రేమ సమాజంలో మరిన్ని సదుపాయాలు సమకూర్చారు. అనాథలైన వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. సోలార్ యూనిట్, 20 బెడ్లు, కొత్తగా మరో భవనం, ఫిల్టర్ వాటర్ యూనిట్, వికలాంగులకు ధర్మసత్రం, గ్రంథాలయం, గంజి కేంద్రాలను ఇప్పుడు ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే కే.ఎస్ఎన్ఎస్ రాజు, విశాఖ ప్రేమసమాజం చైర్మన్ బుద్ధ శివాజీ, చోడవరం ప్రేమసమాజం అభివృద్ధి కమిటీ చైర్మన్ పూసర్ల రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ అనాథలకు ప్రేమసమాజం చక్కటి ఆశ్రయం కల్పిస్తుందన్నారు. అప్పటి కలెక్టర్ అర్జునరావు స్థలసేకరణ చేయడం వల్ల ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉందన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్‌రాజు, ఫోరంఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు ఆర్కే ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, పుట్టా గంగయ్య, సారాక రమేష్, ఆడమ్స్ వెంకట్రావు, రెడ్డి బలరామ్, ప్రకాశరావు, హరిమోహన్, డాక్టర్ విశ్వేశ్వరరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ సేవలు విస్తృతం చేయాలి



ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ట్యాంక్ అందజేస్తున్న అధ్యక్షుడు కృష్ణారావు

నర్సీపట్నం: సామాజిక సేవలను విస్తృతం చేయాలని వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్లు కృష్ణారావు పేర్కొన్నారు. నర్సీపట్నంలో ఆదివారం ఆయన పర్యటించి మాట్లాడారు. పేదలను ఆదుకునేందుకు క్లబ్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్లబ్ చేపడుతున్న సేవలకు అంతర్జాతీయంగా మంచి స్పందన వస్తుందన్నారు. పేదలు చనిపోయినప్పుడు అంత్యక్రియల నిర్వహణకు క్లబ్ ద్వారా రూ.25 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది రెండు లక్షల నోట్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వాటర్ ట్యాంకులు ఉచితంగా అందజేశారు. అనంతరం ఆయనను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ టీం వెలగా నారాయణరావు, పద్మనాభుని రాజేశ్వరి, దేవత అరుణ, వైస్ గవర్నర్ కంచర్ల రమేష్, శ్రీను, వనిత క్లబ్ ప్రెసిడెంట్ గ్రంధి రాధ, సెక్రెటరీ కె.విజయలక్ష్మి, ట్రెజరర్ దాసరి దేవి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.